క్లుప్తంగా

సేవలు అభినందనీయం



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ డాక్టర్ గురుమూర్తి

ఏర్పేడు: యువనేస్తం అసోసియేషన్ సంస్థ సేవలు అభినందనీయమని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి అన్నారు. బుధవారం తిరుపతిలోని తన కార్యాలయంలో యువనేస్తం అసోసియేషన్ మూడవ వార్షిక వాల్ పోస్టర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ఏర్పేడు మండలంలోని పాతవీరాపురానికి చెందిన మునిశేఖర్ యువనేస్తం అసోసియేషన్‌ను ఏర్పాటు చేసి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూండటం అభినందనీయమన్నారు. ప్రధానంగా ఎస్టీల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని సంస్థ ప్రతి నిధులను మెచ్చుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు జస్వంత్, హనుమంతునాయక్, మునెమ్మ, అరుణ, నాగమణి పాల్గొన్నారు.

గోశాలకు ఆవు, దూడ వితరణ



చైర్మన్ అంజూరుకు ఆవు,దూడను అందజేస్తున్న రామ్‌సాయి

తొట్టంబేడు (రేణిగుంట): శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థాన గోశాలకు బుధవారం నాయుడుపేటకు చెందిన రామ్‌సాయి తన కుటుంబ సభ్యులతో ఆవు, దూడను ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. అలాగే గోసంరక్షణకు రూ.5116 విరాళమిచ్చారు.స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం వారిని శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో గోశాల, దేవస్థానం సిబ్బంది కామేశ్వరరావు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

క్రాఫ్ లోన్ చెల్లించినప్పటికీ..



దాసరి మునెమ్మ

తొట్టంబేడు (రేణిగుంట): మండలంలోని చిట్టత్తూరుకు చెందిన దాసరి మునెమ్మ శ్రీకాళహస్తి కెనరా బ్యాంక్ మేనేజర్‌ను కలిసి తనకు న్యాయం చేయాలని కోరారు. గతంలో క్రాఫ్ లోన్ తీసుకొని చెల్లించినప్పటికీ మరలా చెల్లించాలని కోరుతున్నారని, గతంలో ఉన్న క్రాఫ్ లోన్ చెల్లించి మరలా తాను లోన్ తీసుకున్నట్టు చెప్పారు. అయితే అధికారులు ఇంకనూ పాత లోన్ కట్టాలని కోరుతున్నారని, అలాగే కట్టిన రశీదు తెచ్చి చూపాలని కోరుతున్నారని తన సమస్యను నివేదించింది. పరిశీలించి న్యాయం చేయాలని కోరింది.

రక్తపోటుపై అవగాహన అవసరం



రక్తపోటుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పారామెడికల్ సిబ్బంది

చంద్రగిరి(తిరుపతి రూరల్): సర్వ వ్యాధులకు మూలమైన రక్తపోటుపై కళాశాల స్థాయి నుంచే విద్యార్థులు అవగాహన కలిగిఉండాలని ఎంబీయూ ఉపకులపతి ఆచార్య నాగరాజ రామారావు తెలిపారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా బుధవారం వర్సిటీలో పారామెడికల్ విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రక్తపోటు సమస్యలు ఎలా వస్తాయి, వాటి వలన కలిగే దుష్పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రక్తపోటు నివారణ, ఇతర ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించేందుకు తిరుపతిలోని ప్రముఖ ఆసుపత్రులతో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య సారథి, ఫైనాన్స్, అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ రవిశేఖర్, అకడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య రామ్ తదితరులు పాల్గొన్నారు.

జాతరపై టీడీపీ నేతల విషప్రచారం దుర్మార్గం

తిరుపతి కల్చరల్: మునుపెన్నడూ లేని విధంగా గంగమ్మ జాతర దిగ్విజయం నిర్వహించామని, దీన్ని చూసి ఓర్వలేని టీడీపీ నేతలు వక్రబుద్ధితో రాజకీయంతో విమర్శలు చేయడం దుర్మార్గమని శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్ ధ్వజమెత్తారు. ఆయన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తిరుపతి గంగ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించడంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కృషి చేశారని తెలిపారు. జాతర వైభవాన్ని దేశ వ్యాప్తం చేయాలనే ఉద్దేశంతో నగర ప్రముఖులతో చర్చించి ప్రణాళికాబద్ధంగా, ఎక్కడా ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకున్నారని వివరించారు. దీన్ని వక్రబుద్ధితో విమర్శలు చేయడం విడ్డూరమన్నారు. అత్యంత ప్రాచీన చరిత్ర కలిగి, తిరుమల శ్రీవారి చెల్లెలుగా కీర్తి అందుకున్న గంగమ్మను టీడీపీ అధినేత చంద్రబాబు ఏనాడైనా దర్శించుకున్నారా అని ప్రశ్నించారు. ఎస్వీ మ్యూజిక్ కళాశాల ఎదురుగానున్న పెంచలయ్య అంగట్లో తాను సిగరెట్ల కోసం చేసిన అప్పుడు ఇప్పటి వరకు చెల్లించలేదని బాబే స్వయంగా చెప్పారని గుర్తుచేశారు. ఇలాంటి విషయాలు జ్ఞాపకం ఉన్న బాబుకు తిరుమల శ్రీవారి చెల్లెలైన గంగమ్మను దర్శించుకోవడం లేదన్నారు. గంగమ్మ జాతర అంగరంగ వైభవోపేతంగా జరగడంతో పాటు విజయవంతానికి కృషి చేసిన టీటీడీ, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్, తుడా, పోలీసులు, ఎస్పీడీసీఎల్, హెల్త్ విభాగం అధికారులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ పారదర్శకంగా పథకాలు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



అంజూరుపాళెంలో లబ్ధిదారులకు బుక్‌లెట్ ఇస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

కేవీబీ పురం: జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అందిస్తున్నామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. బుధవారం అంజూరుపాళెంలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలతో ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. సంక్షేమ పథకాలకు అర్హులైనప్పటికీ సాంకేతిక కారణాల మూలాన పథకాలు అందని పక్షంలో తన దృష్టికి తేవాలని కోరారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

అంజూరు పాళెం నుంచి జయలక్ష్మి పురం మధ్యలో వంతెన నిర్మించాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. వంతెన లేకపోవడం వల్ల భారీ వర్షం కురిసిన ప్రతిసారీ ఏరులో నీటి ప్రవాహం మూలాన తమకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయని, ఆ సమయంలో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని నివేదించారు. అలాగే గ్రామంలో తాగునీటి వసతి మెరుగు పరచాలని, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని, వీధుల్లో సీసీ రోడ్లు వేయాలని కోరారు. అధికారులతో మాట్లాడి వంతెనను మంజూరు చేయిస్తానని, మిగిలిన సమస్యలను సచివాలయానికి మంజూరయ్యే రూ.20 లక్షలతో ఇతర సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెలే హామీ ఇచ్చారు. వీధిదీపాలు వేయాలని స్థానిక సర్పంచ్, కార్యదర్శిని, విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. మరికొందరు ఇళ్లస్థలాలు, జగనన్న ఇల్లు, పెన్షన్ మంజూరు చేయాలని విన్నవించారు.

రైతు కుటుంబానికి రూ.10 వేల సాయం

అంజూరుపాళెంలో గత నెల ఆత్మహత్య చేసుకున్న రైతు అయ్యప్ప కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. మృతుడి భార్య అంజుకు వైఎస్ఆర్ బీమా పథకం కింద తక్షణ సాయంగా రూ.10 వేలను అందజేశారు. మిగిలిన మొత్తం త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రామచంద్ర, సచివాలయ ఉద్యోగులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గవర్ల క్రిష్ణయ్య, ఎంపీపీ మునిలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు మునెమ్మ, పార్టీ మహిళా విభాగ జిల్లా అధ్యక్షులు మాధవి, సర్పంచ్ గిరి, ఎంపీటీసీ సభ్యులు ప్రసాద్ రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటరత్నం, నాయకులు నందకుమార్, లాల్‌బాబు యాదవ్, హరిబాబు, సురేష్, వెంకటేశ్వర్లు, చెంగయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అంజూరుపాళెంలో మృతుడి కుటుంబానికి బీమా నగదు ఇస్తున్న ఎమ్మెల్యే

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా



ట్యాంకర్ వద్ద తాగునీటిని తీసుకుని వెళుతున్న మహిళలు



తొట్టంబేడు : రామచంద్రాపురంలో..

ఏర్పేడు: మండలంలోని ఎండీ పుత్తూరులో బుధవారం గ్రామస్తులకు ట్యాంకర్లతో తాగునీటి సరఫరా చేశారు. మంగళవారం మండలంలో గాలీవాన ధాటికి మూడు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పంచాయతీ పరిధిలోని గ్రామాలకు తాగునీటి సమస్య తలెత్తింది.

స్పందించిన సర్పంచ్ మోహనప్రియ ట్యాంకర్ల ద్వారా గ్రామాలకు నీటిని సరఫరా చేసి దాహార్తి సమస్యలు పరిష్కరించారు.

రామచంద్రాపురంలో..

తొట్టంబేడు (రేణిగుంట): తొట్టంబేడు మండలం రామచంద్రాపురం తాగునీటి మోటారు పని చేయకపోవడంతో తాగునీటి సమస్య తలెత్తింది. సమస్యను గ్రామస్తులు సర్పంచ్ సుబ్బయ్య దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించారు. ట్యాంకర్‌తో గ్రామస్తులకు తాగునీటిని సరఫరా చేశారు.

భక్తిప్రపత్తులతో ప్రదోష పూజలు



సురుటుపల్లిలో నంది విగ్రహానికి అభిషేకం చేస్తున్న ప్రధాన అర్చకులు

పిచ్చాటూరు: త్రయోదశి పురస్కరించుకుని నాగలాపురం మండలం సురుటుపల్లి శ్రీ పళ్లికొండేశ్వరాలయంలో బుధవారం ప్రదోష పూజలు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. సాయంత్రం ఆలయంలోని స్వయంభు శ్రీ వాల్మీకేశ్వర స్వామికి అభిముఖంగా ఉన్న నందీశ్వరునికి పంచామృతం, చందనం, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం పలు రకాల పుష్పాలతో నందీశ్వరుని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వేదపండితుల మంత్రోచ్చరణ, మంగళవాయిద్యాలు నడుమ నందీశ్వరునికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులతో నైవేద్యం సమర్పించారు. అంతకు ముందు ఆలయంలోని దేవతామూర్తులకు ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. శివపార్వతుల ఉత్సవమూర్తులకు ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఏపీఎం బాలాజీ రెడ్డి, సభ్యులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



సిద్ధిరాజుకండ్రిగలో నందీశ్వరునికి ప్రదోష పూజలు

సోమనాథేశ్వరాలయంలో..

మండలంలోని సిద్ధిరాజు కండ్రిగలోని శ్రీ పార్వతీ సమేత సోమనాథేశ్వరాలయంలో బుధవారం సాయంత్రం ప్రదోష పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త జ్యోతిరాజు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. పర్యవేక్షించారు.

విదేశాల్లో నేటికీ టికెట్‌పైనే నాటక ప్రదర్శన

- సినీనటుడు భానుచందర్‌తో ముఖాముఖి



ప్రముఖ సినీ నటుడు బానుచందర్ బుధవారం గూడూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనతో కాసేపు సాక్షి మాటామంతి కలిపింది. ఈ సందర్భంగా ఆయనతో పంచుకున్న విషయాలిలా ఉన్నాయి. –గూడూరు

ప్రశ్న: మీ పుట్టిన స్థలం?
జవాబు: చెన్నైలో పుట్టా. మా స్వస్థలం కృష్ణా జిల్లా బందరు.

ప్ర: సినీరంగ ప్రవేశం ఎలా జరిగింది?
జ: 1977లో నాలాగే ఎందరో అనే సినిమాతో సినీ రంగ ప్రవేశం చేశాను.

ప్ర: సినీ రంగ ప్రవేశానికి ఆదర్శం ఎవరు?
జ: మా తల్లిగారు, శకుంతల వేణు. మా తండ్రి మాస్టర్ వేణు సంగీత దర్శకుడిగా అందరికీ సుపరిచితుడు. అయితే ఆయన తెర వెనక మాత్రమే ఉండడంతో నన్ను తెరపై చూడాలని సినీ నటుడుగా మద్రాస్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో జాయిన్ చేశారు.

ప్ర: ఇప్పటి వరకు ఎన్ని చిత్రాల్లో నటించారు?
జ: నేను ఇప్పటివరకు తెలుగు, తమిళ, కన్నడ, మళయాళం, హిందీ భాషల్లో 170 చిత్రాలలో నటించా. ప్రస్తుతం వార్‌మెన్, రామ్, మూజ్యిక్ షాపు మూర్తి, శుభలగ్నం సినిమాల్లో నటిస్తున్నా.

ప్ర: అవార్డులు సాధించారా?
జ: నంది అవార్డులు తీసుకున్నప్పటి కీ ప్రజల నుంచి వచ్చే అభినందనలే అవార్డులతో సమానం. మంచి మనసులు సినిమాలోని 'జాబిల్లి కోసం ఆకాశమల్లే' అనే పాట సినిమా పరిశ్రమ ఉన్నంత వరకు ఉంటుంది.

ప్ర: గుర్తింపు తెచ్చిన చిత్రాలు ఏవి?
జ: మెరుపుదాడి, నిరీక్షణ, ముక్కుపుడక, తరంగణి చిత్రాలు ఎప్పటికీ గుర్తుండి పోతాయి.

ప్ర: సినీ రంగం, నాటక రంగానికి తేడా ఏమిటి?
జ: సినీ రంగం, నాటక రంగ వేర్వేరు. నాటక రంగంలో టేక్‌లుండవు, ఏకంగా ప్రేక్షకుల ముందు జీవించాలి, అప్పడే నాటకంలో ఉన్న పాత్రలు, నటులు సహజంగా ఉంటారు.

ప్ర: నాటక రంగంపై మీ అభిప్రాయం?
జ: ప్రభుత్వాలు నాటక రంగాన్ని అభివృద్ధి చేస్తే నటులు కొత్తగా పుట్టుకు వస్తారు. లండన్, అమెరికాలో నేటికీ నాటకాలను టికెట్ పెట్టి చేస్తున్నారు. సాంకేతికత పెరిగిపోవడంతో మన దేశంలో సినిమాలను కూడా నేడు థియేటర్‌లో కాకుండా సెల్ ఫోన్‌లో చూస్తుండడంతో భవిష్యత్తులో కళలపై మక్కువ తగ్గిపోతుందేమోనన్న అనుమానం వస్తోంది.

హజ్ యాత్రికులకు ఆర్థిక సాయం హర్షణీయం



థ్యాంక్యూ సీఎం అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ముస్లింలు

తిరుపతి కల్చరల్: ఆంధ్రప్రదేశ్ నుంచి పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే 1813 మందికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేయడంపై ముస్లింలు హర్షం వ్యక్తం చేశారు. వారు బుధవారం థ్యాంక్స్ సీఎం అంటూ ఖాద్రీ పీఠం వద్ద ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రభుత్వ ఖాజీ సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మైనారిటీల పక్షపాతిగా నిలిచారని తెలిపారు. ఈ ఏడాది ఏపీ నుంచి హజ్ యాత్రకు సుమారు 1813 మంది వెళుతున్నారని తెలిపారు. వారికి విమాన టికెట్‌పై రూ.80 వేలు అదనపు భారం పడడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారని తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి జగనన్న స్పందించి అదనపు భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని భరోసా ఇచ్చారని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం జీవో ఆర్‌టీ నెంబర్–114 జారీ చేసి ఈ నెల 15న రూ.14.51 కోట్లు విడుదల చేశారని వివరించారు. ముఖ్యమంత్రికి ముస్లింల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హాజీలు షేక్ పరీద్ సాహెబ్, ఏటీకే.మాలిక్, షేక్ మునిరామ్, హలీల్ భేగ్, షేక్ సాజహాన్, షేక్ శ్యామ్‌బాషా, షేక్ ఇబ్రహీం, సయ్యద్ టీపూఖాద్రి పాల్గొన్నారు.

శ్రీనివాస మంగాపురంలో చలువ పందిళ్లు ఏర్పాటు

చంద్రగిరి(తిరుపతి రూరల్): వేసవిలో భక్తులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు గాను శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అధికారులు చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఆలయంలో ఉక్కపోత ఎక్కువగా ఉండటంతో కూలర్లు పెట్టారు. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉన్నాయి. ఉక్కపోతతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి ఆలయంలో ఏసీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రానున్న వారం రోజుల్లో ఆలయంలో ఏసీలు ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తామని అధికారులు తెలిపారు.

21 నుంచి విమాన గోపుర మహాసంప్రోక్షణ



అధికారులతో సమీక్షిస్తున్న టీటీడీ జేఈవో వీరబ్రహ్మం

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి ఆలయ విమాన గోపుర మహాసంప్రోక్షణ కార్యక్రమం ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నారు. అలాగే 26 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈ రెండు కార్యక్రమాల ఏర్పాట్లపై బుధవారం రాత్రి టీటీడీ జేఈవో వీరబ్రహ్మం అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ మహాసంప్రోక్షణకు 20వ తేదీన అంకురార్పణ చేస్తామని, 21 నుంచి 24వ తేదీ వరకు వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 25న పూర్ణాహుతి, మహా సంప్రోక్షణ నిర్వహిస్తామని వివరించారు. 20 నుంచి 25వ తేదీ వరకు ఆలయంలో ఊంజల్ సేవను రద్దు చేసినట్టు తెలిపారు. ఈ నెల 25న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తామని, పటిష్ఠంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీటీడీ ఎస్ఏసీఏవో బాలాజీ, సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ ఎలక్ట్రికల్ వెంకటేశ్వర్లు, డెప్యూటీ ఈవోలు శాంతి, గోవిందరాజన్, ఈఈ మనోహర్, వీజీవో మనోహర్, అదనపు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

శస్త్రచికిత్సకు 20 మంది ఎంపిక



పరీక్షిస్తున్న వైద్యుడు

నాయుడుపేటటౌన్: భగవతి మల్లికాంబ ఆలయం వద్ద బుధవారం జరిగిన ఉచిత కంటి వైద్యశిబిరంలో 20 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు అమాస రామానారాయణ తెలిపారు. చెన్నైకు చెందిన శంకర నేత్రాలయం వైద్యుల సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సుమారు 60 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 20 మందికి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వీరిని చెన్నైకు తీసుకెళ్లి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు.

కోలాహలంగా నిమజ్జనం



గంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు

- భక్తులతో కళకళలాడిన అగ్రహారం



ప్రత్యేకాలంకరణలో బీపీ అగ్రహారం గంగమ్మ

తొట్టంబేడు (రేణిగుంట): శ్రీకాళహస్తి పట్టణం బీపీ అగ్రహారం గంగమ్మ జాతరకు బుధవారం భక్తులు పోటెత్తారు. శ్రీ కాళహస్తితోపాటు పరిసర గ్రామాల నుంచి వేలాది మంది ప్రజలు ఎండవేడిమినీ లెక్కచేయకుండా వచ్చి గంగమ్మను దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించారు. జాతర సందర్భంగా దేవస్థానం కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం, మజ్జిగ పంపిణీ చేశారు. భక్తులు వేపాకు, నిమ్మకాయల మాలలు ధరించి, వేయికళ్ల దుత్తలను తలమీద ఉంచుకుని, అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే బైరాగి, బండ, తొటదుర్గమ్మ వేషాలు ధరించి సందడి చేశారు. అమ్మవారిని వెండి ఆభరణాలతో సింహవాహనంపై ఆశీనులు చేసి, బెంగళూరు నుంచి తెప్పించిన పూలతో ప్రత్యేకంగా అలంకరించి, చప్పరంపై అధిష్ఠింపజేశారు. ఆ తర్వాత డప్పులు వాయిస్తూ, నృత్యం చేస్తూ అమ్మవారిని బీపీ అగ్రహారం, ప్రాజెక్టు వీధి, పానగల్ తదితర ప్రాంతాల్లో ఊరేగించారు. జాతరకు వచ్చిన ప్రజలు, భక్తులతో బీపీ అగ్రహారం, పానగల్, ఎఎం పుత్తూరు వార్డులు కళకళలాడాయి. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా వన్‌టౌన్ సీఐ అంజూయాదవ్, ఎస్ఐ తిమ్మప్ప ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు.సాయంత్రం అమ్మవారికి పొంగళ్లు పెట్టారు. పూజల అనంతరం రాత్రి కోలాహలంగా నిమజ్జనం చేశారు.ఎఎం పుత్తూరులో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

పిల్లలను బడిలో చేర్పించండి

- ఇంటింటా కల్లివెట్టు హైస్కూలు టీచర్ల ప్రచారం



కురింజల్లంలో కరపత్ర ప్రచారం చేస్తున్న కల్లివెట్టు ఉన్నత పాఠశాల టీచర్లు

బుచ్చినాయుడుకండ్రిగ: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం ఇంటింటా ప్రచారం చేశారు. కురింజల్లం, తలారివెట్టు గ్రామాల్లో పర్యటించారు. బడి బయట ఉన్న పిల్లలను బడికి పంపాలని, అలాగే ఐదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులను కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతో పాటు కరపత్రాలను ఇచ్చారు. విలువలతో కూడిన విద్యను అందించడం తమ బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, ప్రసాద్ పాల్గొన్నారు.

జోరుగా గర్భాలయ రాతిబండల అమరిక



గర్భాలయ రాతి బండల అమరిక పనులు ప్రారంభిస్తున్న చైర్మన్

తొట్టంబేడు (రేణిగుంట) : శ్రీకాళహస్తిలోని శ్రీ ప్రసన్న వరదరాజుల స్వామి దేవాలయ పునర్నిర్మాణం పనుల్లో బుధవారం రాతిబండల అమరిక పనులకు శ్రీకారం చుట్టారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రాము గుప్తా పూజాది కార్యక్రమాలు చేసి ఈ పనులు ప్రారంభించారు. చైర్మన్ మాట్లాడుతూ, ఈ ఆలయాన్ని సుమారు రూ.6 కోట్లతో పునర్నిర్మాణం చేస్తున్నట్టు చెప్పారు. రాతి బండల అమరిక పనులతో పాటు శిల్ప కళ పనులు కూడా వేగంగా చేసేలా పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షులు చిట్టిబాబు, సభ్యులు అంజూరు వెంకటేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మురళీధర్ రెడ్డి, డీఈ శ్రీనివాస్ రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ సూర్య ప్రసాద్, కాంట్రాక్టర్ యువ కిషోర్, విజయ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతాంగానికి అండగా నిలుద్దాం



మాట్లాడుతున్న శ్యాంప్రసాద్ రెడ్డి

సత్యవేడు: వైఎస్సార్ సీపీ సుపరిపాలనలో రైతాంగానికి అండగా నిలుద్దామని వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కే.శ్యాంప్రసాద్ రెడ్డి అన్నారు. బుధవారం వ్యవసాయ కార్యాలయంలో మండలి సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ, ప్రతి ఆర్‌బీకే కేంద్రం నుంచి 200 బస్తాల ఎరువులు రైతులకు(యూరియా, పొటాష్,) ప్రభుత్వం పంపిణీ చేస్తోందన్నారు. ప్రభుత్వం సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే జనుము, జీలుగు 50 శాతం సబ్సిడీతో ఇస్తున్నట్టు చెప్పారు. మండలంలో రైతులకు 4 ట్రాక్టర్లు మంజూరయ్యాయని, వీటితో పాటు వ్యసాయ పనిముట్లు అందజేస్తామన్నారు. మండలంలో కౌలు రైతులను గుర్తించి ప్రభుత్వం సాయం అందించేందుకు రెవెన్యూ, వ్యవసాయ శాఖఅధికారులు చొరవ చూపాలన్నారు. మండల వ్యవసాయాధికారి మురళి మాట్లాడుతూ, మండలంలో రైతు భరోసాకు 3,360 మంది రైతుల ఆధార్ కార్డులు అనుసంధానం చేశామన్నారు. పీఎం కిసాన్ పొందేందుకు 268 మంది రైతులు ఈకేవైసీ చేయించాలన్నారు. మండలంలో 300 మంది రైతులు ఆధార్ లింక్ చేసుకోవాలని కోరారు. భూసార పరీక్షలు తప్పనిసరిగా చేసుకుని ఆ ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేయాలని కోరారు. కార్యక్రమంలో డీటీ వీఆర్ఓ ఇళయరాజ, డాక్టర్ దయాకర్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు స్వర్ణ, మదన్‌మోహన్, పూర్ణచంద్ర, మురళి, రైతులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఏర్పేడు : రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి మరణించిన సంఘటన బుధవారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో బాలక్రిష్ణాపురం వద్ద చోటుచేసుకుంది. రేణిగుంట రైల్వే పోలీసుల కథనం..తిరుపతి నుంచి శ్రీకాళహస్తి మీదుగా వెళ్లే రైలు నుంచి 38 ఏళ్ల వ్యక్తి జారిపడి మరణించాడు. జీన్స్ ఫ్యాంటు, గళ్ల చొక్కా ధరించి ఉన్నట్టు చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.